క్లుప్తంగా

శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను తక్షణమే ఖాళీ చేయాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్ని రోజులుగా భారీ వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న ఇళ్లు కూలిపోయి ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు ఉంటే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందించాలని కోరారు.

తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్త సత్యనారాయణ కోరారు. బుధవారం పట్టణంలోని వినయ్ గార్డెన్ రోడ్డులో గల ఉద్యమకారుల సంఘ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యమకారులకు పెన్షన్, ఇళ్లు, వారి సంతానానికి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అబ్దుల్ రవూఫ్, మీర్ సాబీర్ అలీ, దేవయ్య, నారాయణ, కె.రమణయ్య, ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘అక్రమ కేసులు సరికావు’

పెంచికల్‌పేట్: తెలంగాణలో నిరుద్యోగులు, విద్యార్థులు, దళితుల పక్షాన మాట్లాడుతున్న హక్కుల నేతలపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని తెలంగాణ కుల నిర్మూలన ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి కోట ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ వచ్చి తొమ్మిదేళ్లు గడిచినా నేటికీ బతుకులు మారలేదన్నారు. ప్రజా సమస్యలపై తమ గళాన్ని వినిపించిన గిరిజనులు సోయం చిన్నయ్య, కోట సతీష్, ధర్మయ్య, నగేష్‌లపైన పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. నేటికీ గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు లేక అల్లాడిపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామంలో ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు ఎలాంటి పరిస్థితుల్లో ఆశ్రయం కల్పించొద్దని గ్రామస్తులకు సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో నాటుసారా తయారీ చేసినా, విక్రయించినా సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

నేడు టెట్ ఉచిత శిక్షణ షెడ్యూల్‌పై సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టెట్, టీఆర్టీ ఉచిత శిక్షణ షెడ్యూల్‌ను ఖరారు చేసేందుకు గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కోనేరు వంశీ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఉచిత టెట్ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకున్న, చేసుకోని అర్హులు హాజరు కావాలని కోరారు.

పత్తి పంట పరిశీలన

వాంకిడి: మండలంలోని కనర్‌గాం, కోమటిగూడ గ్రామ పంచాయతీల పరిధిలోని పత్తి పంటలను మండల వ్యవసాయ అధికారి జాడి మిలింద్ కుమార్ బుధవారం పరిశీలించారు. పంటలో పెనుబంక పురుగు వ్యాప్తి చెందుతుందని రైతులు పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలి

కౌటాల: ఉపాధిహామీ కూలీల డబ్బులు వెంటనే చెల్లించాలని కన్నెపల్లి ఎంపీటీసీ దుర్గం మోతిరాం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయం ఎదుట ఉపాధిహామీ కూలీలతో కలిసి ఆయన నిరసన తెలిపారు. బోదంపల్లి గ్రామంలోని ఉపాధి హామీ కూలీలకు రెండేళ్లుగా డబ్బులు రావడం లేదన్నారు.

మండల సమస్యలు పరిష్కరించాలని వినతి

రెబ్బెన: మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

పనితీరే ప్రామాణికం..!

- రెగ్యులరైజేషన్ జీవోపై జేపీఎస్‌ల అసంతృప్తి
- పనితీరు బాగుంటేనే క్రమబద్ధీకరణ
- ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- ఆందోళనలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు


నవేగాంలో పారిశుధ్య పనులు చేయిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శి

రెబ్బెన: గ్రామ పంచాయతీల్లో పాలన సవ్యంగా సాగడానికి ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి పంచాయతీ కార్యదర్శిని నియమించింది. మూడేళ్ల ప్రొబేషనరీ కాలంతో విధుల్లో చేరిన జేపీఎస్‌లు గత సంవత్సరమే మూడు సంవత్సరాల కాలాన్ని పూర్తి చేసుకున్నారు. సీఎం కేసీఆర్ జేపీఎస్‌ల ప్రొబేషనరీ కాలాన్ని మరో ఏడాది పెంచుతూ అప్పటి వరకు రూ.15వేలుగా ఉన్న వేతనాన్ని రూ. 28వేలకు పెంచారు. తాజాగా జేపీఎస్‌ల నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం సైతం పూర్తయ్యింది. దీంతో వారిని రెగ్యులరైజ్ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

ప్రభుత్వం కొత్త మెలిక..

కొద్ది నెలల క్రితమే నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తి చేసుకున్న జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారి రెగ్యులరైజేషన్‌కు సంబంధించి ప్రభుత్వం కొత్త మెలిక పెట్టింది. నాలుగేళ్ల సర్వీసు కాలంలో జేపీఎస్‌ల పనితీరునే ప్రామాణికంగా తీసుకోనుంది. అందుకు అనుగుణంగా విధివిధానాలపై పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ కార్యదర్శి ఇటీవల జీవో జారీ చేశారు. దీంతో జేపీఎస్‌లల్లో ఆందోళన మొదలైంది.

ప్రత్యేక కమిటీ..

జేపీఎస్‌ల పనితీరు ఆధారంగా వారి సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు జిల్లాస్థాయి పనితీరు మూల్యాంకన కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అదనపు కలెక్టర్ నోడల్ అధికారిగా, ఎస్పీ లేదా డీఎస్పీ, డీఎఫ్‌వోలు కమిటీ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ జేపీఎస్‌ల పనితీరుపై వంద పాయింట్లతో ముదింపు ప్రక్రియ జరిపి దానికి అనుగుణంగా నివేదికలు అందిస్తుంది. పాయింట్ల ఆధారంగా జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం తెలిపింది.

జేపీఎస్‌లు, ఓపీఎస్‌ల అసంతృప్తి..

మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా 10 మంది రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు, 11 మంది జేపీఎస్‌లు, ఇద్దరు ఓపీఎస్‌లు పని చేస్తున్నారు. ప్రొబేషనరీ కాలం పూర్తి కాగానే రెగ్యులరైజ్ చేయకుండా పనితీరు ఆధారంగా రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం పేర్కొనడం సరికాదని జేపీఎస్‌లు మండిపడుతున్నారు. డెప్యూటేషన్‌పై వేరే ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న వారు, మెటర్నటీ లీవ్‌లపై వెళ్లిన మహిళా జేపీఎస్‌లతో పాటు అనేక ఇతర అంశాలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదని జేపీఎస్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జేపీఎస్‌లతో సమానంగా విధులు నిర్వహిస్తూ అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్న ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజ్ విషయంలోనూ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఓపీఎస్‌లు సైతం నిరుత్సాహానికి గురవుతున్నారు.

ఓపెన్ స్కూల్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అశోక్

కెరమెరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్ ఓపెన్ స్కూల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బడి మానేసిన విద్యార్థులు ఓపెన్ స్కూల్ ద్వారా మళ్లీ చదువుకునే వెసులుబాటు ఉందన్నారు. పరీక్షలు రాసే ఆసక్తి ఉన్న వారు ఎస్సెస్సీ కోసం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150, అడ్మిషన్ ఫీజు జనరల్ కేటగిరికి రూ.1400, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగులకు రూ.1000, ఇంటర్మీడియెట్ కోసం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300, అడ్మిషన్ ఫీజు జనరల్ కేటగిరికి రూ.1500, స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగులకు రూ.1200 ఈనెల 10 లోపు చెల్లించాలన్నారు. ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, ఓపెన్ స్కూల్ మండల అసిస్టెంట్ కోఆర్డినేటర్ సంతోష్‌కుమార్ ఉన్నారు.

తల్లిపాలు శిశువులకు ఎంతో శ్రేష్ఠం


కాగజ్‌నగర్‌రూరల్: మాట్లాడుతున్న సురేఖ


కెరమెరి: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్‌రూరల్: తల్లిపాలు శిశువులకు ఎంతో శ్రేష్ఠమని సీడీపీవో సురేఖ అన్నారు. మండలంలోని నజ్రుల్‌నగర్ విలేజ్ నెం.12, చింతగూడ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి ముర్రుపాలు తాగించాలన్నారు. తల్లిపాలతోనే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ మాధవీలత, ఏఎన్‌ఎంలు జ్యోతి, రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: డబ్బా పాలతో పుట్టిన బిడ్డకు హాని కలుగుతుందని అంగన్‌వాడీ కార్యకర్త బొజ్జుబాయి పేర్కొన్నారు. సుర్దాపూర్‌లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గ్రామాల్లో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. తల్లిపాలు తాగిన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీచర్లు కవిత, క్రిష్ణమూర్తి ఉన్నారు.

వాంకిడి: బిడ్డకు తల్లి పాలే శ్రేష్ఠమని సీడీపీవో రెబ్కా అన్నారు. మండలంలోని బంబార రైతువేదికలో బుధవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లి పాల సంస్కృతి కార్యక్రమం నిర్వహించారు. పోషణ్ కోఆర్డినేటర్ తౌఫిక్, సూపర్‌వైజర్లు నసీమ్, భారతి, కుమారి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి


తిర్యాణి: టీకా వేస్తున్న వైద్యుడు రామకృష్ణ

తిర్యాణి: మండలంలోని కన్నెపల్లి గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు రామకృష్ణ మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 30 వరకు అన్ని గ్రామాల్లో పశువైద్య శిబిరం నిర్వహించి టీకాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, సర్పంచ్ మమత తదితరులు ఉన్నారు.

కౌటాల: పశు పోషకులు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశువైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. సర్పంచ్ పోరేతు చరందాస్, సిబ్బంది సందీప్, రాజన్న, ప్రకాశ్, భిక్షపతి, శోభన్, సత్యనారాయణ రైతులు పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని బెండార గ్రామంలో బుధవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

‘చలో హైదరాబాద్’ జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

దహెగాం: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ ఈనెల 12న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ మండల అధ్యక్షుడు కంబాల జయేందర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీపీఎస్ వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పాత పెన్షన్ సాధన కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడు మహేష్, గౌరవ అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యాయులు భరత్, ప్రవీణ్, గోపి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘాల్లో చైతన్యం తీసుకురావాలి


ఎమ్మెల్యేను కలిసిన కుల సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: కుల సంఘాల్లో చైతన్యం తీసుకురావాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఈ నెల 6న జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్‌లో నిర్వహించనున్న పద్మశాలీ సంఘం జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాలని కుల సంఘం నాయకులు ఆహ్వానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు శంకర్, జిల్లా నాయకులు మంగ, లింగయ్య, చందు, శ్రీకాంత్, చిప్ప సురేశ్, తిరుపతి, మోహన్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ కోరారు. జిల్లా కేంద్రంలో బుధవారం మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు సమ్మెలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మహాధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, నాయకులు శ్రీనివాస్, దివాకర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రెబ్బెన: అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం ఏరియా జీఎం రవిప్రసాద్ ఆదేశాల మేరకు గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయులు సంతోష్, ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం ఆర్లరెడ్డి, ఉపాధ్యాయులు బాబునాయక్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

తలండిలో వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తిర్యాణి: మండలంలోని తలండి గ్రామంలో బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు వెంకటేశ్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సిబ్బంది శ్రీనివాస్, పరుశురాం, బద్రుబాయి ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

వాంకిడి: న్యాయమైన డిమాండ్లతో నిరవధిక సమ్మె బాట పట్టిన తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపీపీ విమలబాయికి జీపీ కార్మికులు వినతి పత్రం అందజేశారు.

ఇన్‌స్పైర్ నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి

రెబ్బెన: అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఈనెల 7వ తేదీలోగా ఇన్‌స్పైర్ నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా సైన్స్ అధికారి మధూకర్, ఎంఈవో వెంకటేశ్వర స్వామిలు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఇన్‌స్పైర్ నామినేషన్లకు సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎంలు చరణ్‌దాస్, రాజేశ్వర్, రిసోర్స్ పర్సన్ తిరుపతయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10 నిరుపేద కుటుంబాలకు బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎస్సై వెంకటేశ్ మాట్లాడుతూ యువత సేవ చేయడంలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రవీణ్, వెంకన్న, శేఖర్, రాజమౌళి, రాజేశ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ ఏఈగా సదాశివ్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యుత్‌శాఖ ఆసిఫాబాద్ పట్టణ ఏఈగా సదాశివ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఆయన పేర్కొన్నారు.

‘తొలిమెట్టు’ శిక్షణ ప్రారంభం


దహెగాం: మాట్లాడుతున్న భరత్


పెంచికల్‌పేట్: శిక్షణ ఇస్తున్న యాదగిరి

దహెగాం: ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాల పెంపు కోసం నిర్వహిస్తున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. బుధవారం నుంచి ప్రారంభమైన శిక్షణ ఈనెల 8 వరకు కొనసాగనుంది. మండల నోడల్ అధికారి భరత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాల పెంపు కోసం శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. తెలుగు, గణితం, ఆంగ్లంపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, రిసోర్స్ పర్సన్‌లు పోచయ్య, రాంకుమార్, ప్రవీణ్‌కుమార్, స్రవంతి, సాయికిరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి గుండు యాదగిరి ఆధ్వర్యంలో ఆరు రోజుల ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు అనుసరించాల్సిన బోధనా ప్రక్రియపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో రమేశ్‌బాబు పరిశీలించారు. వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెరమెరి: అక్షరాస్యతలో మండలాన్ని ముందుంచాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభించిన రెండో విడత తొలిమెట్టు శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను పాఠశాలలో అమలు చేస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ నోడల్ అధికారి భరత్‌రావు, ఆర్‌పీలు నరేష్, వినీత్ ఉపాధ్యాయులు ఉన్నారు.

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి తొలిమెట్టు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఎస్‌వో స్వర్ణ, ఎంఈవో సోమయ్య, హెచ్‌ఎం హన్మంతు, ఆర్‌పీలు విజయ్‌కుమార్, నాగేష్‌కుమార్, సీఆర్పీ రవికుమార్ పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎంఈవో మనుకుమార్, నోడల్ అధికారి రాథోడ్ సుభాష్ ఆధ్వర్యంలో తొలిమెట్టుపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాల పెంపు కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు సందీప్, విజయ్‌బాబు, సునీల్ పాల్గొన్నారు.

‘అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు’

కెరమెరి: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అన్యాయం చేయొద్దని రాజ్‌భవన్ ముట్టడించిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాంచందర్, తిరుపతి, మారుతి ఉన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ, కాంట్రాక్ట్ కార్మికుల కార్యదర్శి చల్లూరి అశోక్, సహాయ కార్యదర్శి కొయ్యాడ సాగర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతిపత్రం అందజేశారు. కార్మిక నాయకులు శంకర్, సుగుణాకర్, జంపన్న, జీవంత్ రావు ఉన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు


మొక్క అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రెబ్బెన: జిల్లా నూతన అదనపు కలెక్టర్ దీపక్ తివారీని బుధవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు క్రిష్ణ, ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, రెబ్బెన జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్‌కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీలో చేరికలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని టీఆర్ నగర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గం సభ్యుడు ఆత్మరాం నాయక్ ఆధ్వర్యంలో 100 మందికిపైగా కాలనీవాసులు బీజేపీలో చేరారు. మండల అధ్యక్షుడు శ్రీధర్, జయరాం, అశోక్ తదితరులు ఉన్నారు.





ముమ్మరంగా వరి నాట్లు

జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో కాస్త ఆలస్యమైనా వరి సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొందరు రైతులు కేజీవీల్స్‌తో పొలాలు సిద్ధం చేస్తుండగా, మరికొందరు నాట్లు వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. దహెగాం మండలంలో 6వేల ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. రైతులందరూ ఒకేసారి నాట్లు వేస్తుండడంతో కేజీవీల్స్ ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది. కూలీల కొరత సైతం ఏర్పడుతోంది. ఎకరం వరి నాట్లు వేయడానికి రూ. 5వేల నుంచి రూ. 6 వేల వరకు కూలీలకు ఖర్చవుతుందని రైతులు పేర్కొంటున్నారు. – దహెగాం